

రూ.50 వేల విరాళం

అమలాపురం టౌన్: వెంకటేశ్వర ఆలయ అభివృద్ధికి వెంకట సాయి ఆక్వా నీడ్స్ యజమాని మంతెన వెంకట రామరాజు, పర్మిల దంపతులు (అమలాపురం) రూ.50 వేలు సమర్పించారు.



నిత్యాన్నదాన పథకానికి విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి లంక శ్రీరామమూర్తి (మదిలీపట్నం) శనివారం రూ.2 లక్షల విరాళం సమర్పించారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 9,450 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,850, మధ్య డెల్టాకు 1,800, పశ్చిమ డెల్టాకు 4,800 క్యూసెక్కుల చొప్పున వదిలారు.

న్యూస్‌రీల్

జాతీయ కర్లింగ్‌లో కాకినాడ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులు

బాలాజీచెరువు: జమ్ము–కశ్మీర్ గుల్‌మార్గ్ ఐస్ స్కేటింగ్ రింగ్‌లో నిర్వహించిన జాతీయ కర్లింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో కాకినాడ విద్యార్థులు ప్రతిభ చూపారు. సీనియర్ మహిళా విభాగంలో ఎం.తేజశ్రీ బంగారు పతకం, సబ్ జూనియర్ మిక్స్‌డ్ డబుల్స్‌లో నల్లమిల్లి శేషురితీష్‌రెడ్డి (లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్) కాంస్య పతకం, సబ్ జూనియర్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో నల్లమిల్లి శేషు రితీష్ రెడ్డి, ఎస్.అర్జున్ (లక్ష్య ఇంటర్నేషనల్‌స్కూల్), బి.నాగేంద్రనాథ్‌ఠాగూర్(ఆశ్రమ్ పబ్లిక్ స్కూల్) కాంస్య పతకాలు సాధించారు. విజేతలను, కోచ్‌లు సురేంద్రరెడ్డి, ఎస్‌హెచ్‌ఎన్‌బీ కృష్ణలను లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.సుగుణరెడ్డి అభినందించారు.

గోరటి వెంకన్నకు వేటూరి పురస్కారం



గోరటి వెంకన్న

తుని: ద్వాదశి వేటూరి కవితా పురస్కారాన్ని కవి, గాయకుడు గోరటి వెంకన్నకు ప్రదానం చేయనున్నట్లు వేటూరి సాహితీ పీఠం, శ్రీప్రకాష్ కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు కలగా రామజోగేశ్వర శర్మ, సీహెచ్ విజయ్‌ప్రకాష్ శనివారం తెలిపారు. తునిలో వేటూరి సాహితీ పీఠం ఏర్పాటు చేసి 12 ఏళ్లు అవుతుందని, ఏటా సినీరంగానికి చెందిన ప్రముఖులకు పురస్కారం అందిస్తున్నామని వీరు చెప్పారు. ఈ నెల 29న జాతీయ రహదారిలోని చిట్టూరి మెట్రోలో జరిగే వేటూరి జయంతి వేడుకలకు ఆత్మీయ అతిథిగా సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్ హాజరవుతారన్నారు. కార్యక్రమానికి వేటూరి సుందర రామ్మూర్తి అభిమానులు హాజరు కావాలని కోరారు.

నేటి నుంచి సంగీత, గాత్ర, వీణావాద్య పోటీలు

కాకినాడ కల్చరల్: స్థానిక సూర్యకళామందిర్‌లో సంగీత విద్వత్సభ 75వ సంక్రాంతి వార్షికోత్సవాలు శనివారం నుంచి నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం రాష్ట్రస్థాయి కర్ణాటక సంగీత, గాత్ర, వీణా వాద్య పోటీలు నిర్వహించనున్నట్టు సభ కార్యదర్శి వక్కలంక రామకృష్ణ తెలిపారు. జూనియర్, సీనియర్స్ విభాగాలుగా పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 16 ఏళ్ల లోపు బాలబాలికలు జూనియర్లుగా, 17 నుంచి 26 ఏళ్ల లోపు వారు సీనియర్లుగా పరిగణిస్తామన్నారు. వివరాలకు 94410 11668 మొబైల్ నంబరును సంప్రదించాలని కోరారు.

ద్విచక్ర వాహన దొంగల ఆటకట్టు

కాకినాడ క్రైం: జిల్లా పరిధిలో ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతున్న ఐదుగురు నిందితులతో పాటు ఓ సైకిల్ దొంగను జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. సంబంధిత వివరాలను జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు శనివారం కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో మీడియాకు వెల్లడించారు. వరుస ద్విచక్రవాహనాల చోరీలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో అదనపు ఎస్పీ శ్రీనివాస్ పర్యవేక్షణలో క్రైం డీఎస్పీ రాంబాబు ఆధ్వర్యంలో ఓ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. దొంగల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించి ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతున్న ఐదుగురు నిందితులతో పాటు ఓ సైకిల్ దొంగను అరెస్టు చేశామన్నారు. రూ.16 లక్షల విలువైన 40 ద్విచక్రవాహనాలు, రూ.50 వేలు విలువ చేసే 10 సైకిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులు పట్టా హరీష్, యర్రంశెట్టి ఉపేంద్ర, కేశనకుర్తి శ్రీనివాసరావు, ధవళేశ్వరపు నాగబాబు, వైదాడి ధనశేఖర్‌లను అరెస్టు చేశామన్నారు. సైకిళ్లు దొంగిలిస్తున్న షాజహాన్‌ను కూడా అరెస్టు చేశామన్నారు. నిందితుల్లో హరీష్ 2017లో ద్విచక్రవాహనాల చోరీలో అరెస్టు అయి జైలు శిక్ష అనుభవించాడన్నారు.

తీరాన భక్తజన కెరటాలు



నేమాం బీచ్‌లో చొల్లంగి అమావాస్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

చొల్లంగి అమావాస్య సందర్భంగా కాకినాడ రూరల్ మండలం నేమాం బీచ్‌లో సముద్ర స్నానాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారు జాము నుంచి పుణ్య స్నానాలు చేసి, పితృ దేవతల పేరిట పండ్లు ఇచ్చి పెద్దల ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఆర్మీ, నేవీ విన్యాసాల నేపథ్యంలో బీచ్ రోడ్డును మూసివేడయంతో నేమాం మీదుగా జనాలు భారీగా వాహనాలలో చేరుకోవడంతో బీచ్ నుంచి నేమాం వరకు ట్రాఫిక్ స్తంభించింది. కొందరు భక్తులు ఆ ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు.

– కాకినాడ రూరల్



నేమాం బీచ్ మార్గంలో రద్దీ

కొలువుల చికిత్స



ఉమ్మడి 'తూర్పు'న డీఎంఅండ్‌హెచ్‌ఓల పరిధిలో పోస్టుల భర్తీ ఇలా

ఆర్ఎంసీ, కాకినాడ	జీజీహెచ్, కాకినాడ	వైద్య కళాశాల, రాజమహేంద్రవరం	టీచింగ్ ఆస్పత్రి, రాజమహేంద్రవరం	డీసీహెచ్ఎస్	డీఎంహెచ్ఓ
7	11	42	109	103	49



స్టాఫ్ నర్స్‌గా ఎంపికైన యువతికి నియామక పత్రం అందిస్తున్న ఆర్‌డీ డాక్టర్ పద్మా శశిధర్

- వైద్య, ఆరోగ్య శాఖలో ఉద్యోగాల విప్లవం
- ఖాళీ పోస్టులన్నీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో భర్తీ
- ఉమ్మడి 'తూర్పు'న 3 వేల నియామకాలు
- ఇప్పటికే 1,186 మిడ్‌లెవెల్.. 26 కేడర్లలో మరో 321 పోస్టుల భర్తీ

సాక్షి, రాజమహేంద్రవరం: అందుబాటులో లేని వైద్యులు.. అరకొర సిబ్బంది.. చాలీచాలని మందులు.. సౌకర్యాల లేమి.. ఇటువంటి అనారోగ్యాలతో సతమతమవుతున్న ప్రభుత్వాసుపత్రులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మూడేళ్లుగా అవసరమైన చికిత్స చేపట్టింది. 'నాడు–నేడు'తో ఆస్పత్రుల అభివృద్ధికి నాంది పలుకుతూనే.. మౌలిక వసతుల కల్పనకూ ప్రాధాన్యం ఇచ్చింది. మరోపక్క వైద్య, ఆరోగ్య రంగంలో ఏ ఒక్క పోస్టూ ఖాళీగా ఉండరాదన్న ఉద్దేశంతో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగాల విప్లవానికి శ్రీకారం చుట్టింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఈ శాఖలో ఇప్పటి వరకూ సుమారు 3 వేల ఉద్యోగాలు భర్తీ చేశారు.

గతంతో వైద్య, ఆరోగ్య శాఖలో ఒక్క పోస్టు భర్తీ చేయాలంటే సంవత్సరాల కాలం పట్టేది. వైద్య విద్య పూర్తి చేసుకున్న వారు, నర్సింగ్ శిక్షణ పొందిన వారు, వివిధ టెక్నీషియన్లు నోటిఫికేషన్ కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చేసేవారు. ఒకవేళ నోటిఫికేషన్ ఇచ్చినా అరకొర పోస్టులతో ఉద్యోగ సాధన కష్టంగా మారేది. మామూళ్లు ముట్టజెప్పిన వారికే అగ్రతాంబూలం వేసేవారు. దీంతో అర్హులకు అన్యాయం జరిగేది.

ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవు. ప్రభుత్వ వైద్య రంగం అభివృద్ధికి, వైద్య, ఆరోగ్య శాఖ మెరుగుదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారు. నిత్యం ఏదో ఒక పోస్టు భర్తీకి నోటిఫికేషన్ ఇస్తున్నారు. అర్హత, మెరిట్, సామర్థ్యం ఉన్న వారికి మాత్రమే ఉద్యోగాలు వచ్చేలా సంస్కరణలు చేపట్టారు. ఎవ్వరికీ ఒక్క రూపాయి కూడా చెల్లించకుండానే పోస్టుల భర్తీ ప్రక్రియను ప్రభుత్వం పారదర్శకంగా చేపట్టింది. ప్రతి 6 నెలలకోసారి ఏదో ఒక నోటిఫికేషన్ ఇస్తూ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తోంది. మెరిట్ ప్రాతిపదికగా ఎలాంటి అవకతవకలకూ తావు లేకుండా పోస్టులు భర్తీ చేస్తోంది. ఫలితంగా అర్బన్ హెల్త్ సెంటర్లు, పీహెచ్‌సీలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ఇతర అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మేరకు సిబ్బంది ఉంటున్నారు. దీంతో వైద్య సేవల్లో ఎటువంటి జాప్యమూ జరగడం లేదు.

ఆర్‌డీ పరిధిలో మూడేళ్లుగా భర్తీ చేసిన ఉద్యోగాల్లో కొన్ని..

జిల్లా	విలేజ్ హెల్త్ క్లినిక్‌లు	ఎంఎల్‌హెచ్‌పీ స్టాఫ్ నర్సులు
కాకినాడ	410	400
తూర్పు గోదావరి	368	367
కోనసీమ	432	419
అల్లూరి సీతారామరాజు	112	71

పోస్టులు భర్తీ చేశారిలా..

- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 1,240 గ్రామ/వార్డు సచివాలయాలు ఉన్నాయి. ప్రతి సచివాలయంలో ఒక్కో హెల్త్ సెక్రటరీ (ఏఎన్ఎం) చొప్పున 1,240 మందిని నియమించారు. వీరు సచివాయాల పరిధిలో ఆరో గ్య కార్యక్రమాలను పర్యవే క్షించడంతో పాటు వారి పరిధిలో ప్రథమ చికిత్స సేవలు అందిస్తున్నారు.
- గ్రామీణ ప్రాంతాల్లోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో వైద్య సేవలు అందించేందుకు బీఎస్సీ నర్సింగ్ విద్య పూర్తి చేసిన అభ్యర్థులను మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు(స్టాఫ్ నర్స్)గా నియమించారు. మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ జోన్–2 జోన్–2 (రాజమహేంద్రవరం) రీజనల్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) పరిధిలోని 8 జిల్లాల్లో ఇప్పటి వరకూ 2,698 మందికి ఉద్యోగాలు కల్పించగా.. ఒక్క ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోనే 1,186 ఉద్యోగాలు భర్తీ చేశారు. తాజాగా మరో 200 పైగా స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి మార్గం సుగమమైంది. త్వరలోనే వీరు సైతం విధుల్లో చేరనున్నారు. మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు గ్రామీణ ప్రాంతాల్లో వైద్యుల పాత్ర పోషిస్తున్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్, ఆరోగ్యశ్రీ సేవలను దగ్గరుండి చూసుకుంటున్నారు.
- కాకినాడ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) పరిధిలోని 26 క్యాడర్లలో 321 నియామకాలు చేపట్టారు. కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్న పోస్టులకు మోక్షం కల్పించారు. వెరసి కాకినాడ రంగరాయ వైద్య కళాశాల (ఆర్ఎంసీ), కాకినాడ ప్రభుత్వాస్పత్రి (జీజీహెచ్), రాజమహేంద్రవరం వైద్య కళాశాల, ఇక్కడి టీచింగ్ ఆస్పత్రి, జిల్లా ప్రభుత్వ వైద్య సేవల సమన్వయాధికారి (డీసీహెచ్ఎస్), డీఎంహెచ్ఓ పరిధుల్లో సిబ్బంది కొరత తీరింది.
- ప్రధానంగా అనస్తీషియా టెక్నీషియన్లు 10, రేడియోగ్రాఫర్ 13, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ 10, జనరల్ డ్యూటీ అటెండెంట్స్ 55, ఎంఎన్ఓ/ఎఫ్ఎన్ఓ 40, ల్యాబ్ అటెండెంట్ 16, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్–2 – 33, మార్చురీ/పోస్టుమార్టమ్ అటెండెంట్ 7, ఓటీ టెక్నీషియన్ 5, ఆఫీస్ సబార్డినేట్లు 20, ఫార్మసిస్ట్ గ్రేడ్–2 – 24, ప్లంబర్ 7, శానిటరీ అటెండర్/వాచ్‌మన్ 5, ఎఫ్ఎన్ఓ 20 చొప్పున ఉద్యోగాలు భర్తీ చేశారు. అవసరమైన శాఖల్లో అదనపు పోస్టులు సృష్టించి మరీ నియామకాలు జరిపారు.

పటిష్టంగా కానిస్టేబుల్ పరీక్షలు

- పరీక్షల నిర్వహణకు హాజరుకానున్న సిబ్బందికి ఎస్పీ సూచనలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రవీంద్రనాథ్ బాబు ఇతర అధికారులు

కాకినాడ క్రైం: రాష్ట్ర పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఆదివారం జరగనున్న ఎస్‌సీటీ కానిస్టేబుల్ ప్రిలిమ్స్ రాత పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్టు ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు తెలిపారు. 59 పరీక్షా కేంద్రాల్లో జరగనున్న ఈ పరీక్షలకు 30,272 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని అన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగబోయే పరీక్షలకు అభ్యర్థుల్ని ఉదయం 9 గంటల నుంచే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని తెలిపారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదన్నారు. స్త్రీ అభ్యర్థుల చెకింగ్ కోసం ప్రత్యేక మహిళా బృందాల్ని అన్ని పరీక్షా కేంద్రాల్లోనూ నియమించామని, ఎలక్ట్రానిక్ పరికారాలను కేంద్రంలోకి అనుమతించబోమని అన్నారు. పరీక్షా కేంద్రాలకు సమీపంలో ఉన్న ఇంటర్నెట్ కేంద్రాలు, జిరాక్స్ షాపులను మూయించనున్నట్లు తెలిపారు. డివిజినల్ స్థాయిలో డీఎస్పీలు పరీక్షా కేంద్రాలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నారన్నారు.

ప్రత్యేక బస్‌లు : ఈ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల సౌలభ్యం కోసం ప్రత్యేక బస్‌లు నడపనున్నట్లు ఆర్టీసీ యాజమాన్యం తెలిపిందని ఎస్పీ అన్నారు. ఉదయం ఆరు గంటల నుంచే కాకినాడ నుంచి సూరంపాలెం, కోరంగి డైట్ కాలేజీ, పెద్దాపురం మహారాణికాలేజ్, దివిలి, చేబ్రోలులోని పరీక్షా కేంద్రాలకు, అలాగే తుని, ఏలేశ్వరం నుంచి వివిధ పరీక్షా కేంద్రాలకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని ఎస్పీ తెలిపారు.

పట్టుబడితే క్రిమినల్ కేసులు: కాపీయింగ్, మాల్‌ప్రాక్టీస్‌తో పాటు బోర్డు నిబంధనలకు విరుద్ధంగా ఏ చర్యలకు పాల్పడినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

అలరించిన భరతనాట్యం

సంగీత విద్వత్సభ ప్రారంభం

కాకినాడ కల్చరల్: స్థానిక సూర్యకళామందిర్‌లో నర్తకీమణులు వక్కలంక సీత, కాశీభట్ల నిత్య ప్రదర్శించిన భరతనాట్యం ప్రేక్షకులను అలరించింది. సంగీత విద్వత్సభ ఆధ్వర్యంలో సూర్యకళామందిర్‌లో శనివారం సాయంత్రం 75వ సంక్రాంతి వార్షికోత్సవాలను ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ప్రారంభించారు. ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు సభ కృషి చేస్తుందని సభాధ్యక్షుడు నారాయణం మురళి అన్నారు.



జ్యోతిప్రజ్వలనలో పాల్గొన్న ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు తదితరులు

క్షేత్రస్థాయికి సంక్షేమ పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న పుత్తా ప్రతాప్‌రెడ్డి

కాకినాడ సిటీ: రాజకీయ, కుల, మతాలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింతగా తీసుకువెళ్లాలని జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల రాష్ట్ర కో–ఆర్డినేటర్ పుత్తా ప్రతాప్‌రెడ్డి కోరారు. శనివారం కాకినాడ ఆర్అండ్‌బీ అతిథి గృహంలో జిల్లా సచివాలయ మండల ఇన్‌ఛార్జిల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్అండ్‌బీ మంత్రి దాడిశెట్టి రాజా, జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే, కురసాల కన్నబాబు, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్ర బోస్, ఎమ్మెల్యేలు పెండెం దొరబాబు, జ్యోతుల చంటిబాబు, శ్రీపూర్ణచంద్రప్రసాద్, రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ చైర్మన్ దవులూరి దొరబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి ప్రసంగిస్తూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత పటిష్టంగా తయారు చేసేందుకు సమష్టిగా కష్టపడి పని చేయాలన్నారు. గృహ సారథులు, కన్వీనర్లు ప్రతి సంక్షేమాన్ని, పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లేందుకు కృషి చేయాలన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పని చేయాలన్నారు. సమన్వయంతో పని చేసినప్పుడే ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందుతాయన్నారు. ప్రతిపక్షాలు చేసే ఆరోపణలు, ఎల్లో మీడియా దుష్ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలన్నారు. జిల్లాలోని వైఎస్సార్ సీపీ నాయకులు, గృహసారథులు, కన్వీనర్లు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విదేశీ మారకద్రవ్యార్జనలో ఆక్వా అగ్రగామి



స్టాల్స్ పరిశీలిస్తున్న ఎంపీ వంగా గీత తదితరులు

బోట్‌క్లబ్(కాకినాడసిటీ): విదేశీమారక ద్రవ్యం ఆర్జించడంలో ఆక్వారంగం ప్రథమ స్థానంలో ఉందని ఎంపీ వంగా గీత అన్నారు. కాకినాడలోని ఎస్ఆర్ఎంటీ ఫంక్షన్‌హాల్‌లో శనివారం ఆక్వాటిక్ ఎక్స్‌పో–2023ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మన రాష్ట్రంలో ఆక్వారంగంపై సుమారు 11 లక్షల నుంచి 16 లక్షల మంది ఆధారపడి బతుకుతున్నారన్నారు. ఉభయగోదావరి జిల్లాల నుంచే ఆక్వా ఎగుమతులు ఎక్కువగా జరగడం విశేషమన్నారు. ఈ రంగంలో సమస్యలుంటే త్వరలో జరిగే పార్లమెంట్ సమావేశంలో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు. ఆక్వారంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెన్నుదన్నుగా ఉంటున్నారన్నారు. కరోనా సమయంలో ఎగుమతులు లేక ఇబ్బందులు పడుతుంటే అన్ని విధాలా ఆదుకున్నారన్నారు. సబ్సిడీపై విద్యుత్ అందించడంతో పాటు, ఫీడ్ ధరలకు కళ్లెం వేశారన్నారు. యాంటీ బయోటిక్స్ వాడని ఉత్పత్తులు పండించి ప్రజలకు అందించాలని రైతులను కోరారు. విదేశాలకు ఎగుమతులు లేకపోయినా దేశంలోనే వాటికి డిమాండ్ పెంచే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఆక్వా కార్మికుల భద్రతకు రైతులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఆక్వా అభివృద్ధికి ఇటువంటి ఎక్స్‌పోలు ఉపయోగపడతాయన్నారు. అప్సడా కో వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ మాట్లాడుతూ ఆక్వా రైతుల ఇబ్బందులను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి సాధికారిత కమిటీ కూడా ఏర్పాటు చేశారన్నారు. ఫీడ్ ధరలు పెరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకొంటుందన్నారు. హైప్రొటీన్ ఫుడ్ తక్కువ ధరలకు అందించిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అనంతరం ఉత్తమ రైతు సూర్యారావు, అబ్బు, రఘురామ్, రవితేజలను ఎక్స్‌పో నిర్వాహకుడు కె. జోసఫ్ సత్కరించారు. తొలుత ముఖ్య అతిథులు స్టాల్స్‌ను పరిశీలించారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, కౌడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఏపీ ఫిషర్‌మేన్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ చైర్మన్ అనిల్‌బాబు పాల్గొన్నారు.

బాదం మాధవరావు కన్నుమూత

కాకినాడ కల్చరల్/పిఠాపురం: పిఠాపురానికి చెందిన అభ్యుదయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బాదం మాధవరావు (85) అనారోగ్యంతో శనివారం కాకినాడలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో కన్నుమూశారు. సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు కళారంగాన్ని ఆయన ఎంతో ప్రోత్సహించేవారు. 1938 డిసెంబర్ 25న పిఠాపురంలో బాదం అప్పారావు గుప్తా, అప్పలరాజు దంపతులకు ఆయన జన్మించారు. ఎస్ఎస్ఎల్సీ వరకూ చదువుకున్నారు. మాధవరావు భార్య చంద్రప్రభ 2017లో మృతి చెందారు. ఆయన 2000 సంవత్సరం నుంచి కాకినాడలో స్థిరపడ్డారు. ఆయన అనేక సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కష్టపడి సంపాదించిన ధనాన్ని ప్రజోపయోగ కార్యక్రమాలకు వెచ్చించేవారు. కళలను, కళాకారులను ప్రోత్సహించేందుకు కాకినాడలో అభ్యుదయ ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. దీని ద్వారా కాకినాడ సూర్య కళామందిర్‌లో ఏటా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసేవారు. ఔత్సాహిక కళాకారులకు పురస్కారాలు ప్రదానం చేసి, సత్కరించేవారు. కాకినాడ ఐ ఫౌండేషన్‌కు, ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థకు, సరస్వతీ గానసభకు విరాళాలు ఇచ్చారు. బాలికల విద్యను ప్రోత్సహించేందుకు పిఠాపురంలో ఐదెకరాల విస్తీర్ణంలో సుమారు రూ.కోటితో ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల నిర్మించారు. నూరేళ్ల చరిత్ర కలిగి, శిథిలావస్థకు చేరిన సూర్యరాయ విద్యానంద గ్రంథాలయ భవనాన్ని నిర్మించారు. పిఠాపురం పట్టణంలో అనేక హిందూ దేవాలయాలను పునర్నిర్మించారు. సేవా కార్యక్రమాలతో ఎంతో మందికి సహాయ సహకారాలు అందించారు. ఆయన మృతికి సంతాపంగా పిఠాపురంలో సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం, బాదం మాధవరావు పాఠశాలకు సెలవు ప్రకటించారు. ప్రజలు, అభిమానుల సందర్శనార్థం కాకినాడలోని నివాసంలో ఉంచిన మాధవరావు భౌతిక కాయాన్ని ఎంపీ వంగా గీత సందర్శించి నివాళులర్పించారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ ఆర్గనైజర్ చినబాబు, ముత్తా నవీన్, పంపన దయానందబాబు తదితరులు మాధవరావు కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.



బాదం మాధవరావు (ఫైల్)



బాదం మాధవరావు భౌతిక కాయానికి ఎంపీ వంగా గీత నివాళి

ఏనాడూ పోరాడని వ్యక్తి విమర్శలు చేయడమా

సూర్యనారాయణ వైఖరిపై ఎన్జీవో జిల్లా సంఘం ఆగ్రహం



అత్యవసర సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎన్జీవో అసోసియేషన్ నేతలు

కాకినాడ సిటీ: నిరంతరం ఉద్యోగుల ప్రయోజనాలు, హక్కుల సాధనకు పోరాడుతున్న తమ సంఘాన్ని ఏపీ జీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ విమర్శించడాన్ని ఏపీ ఎన్జీవో సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కార్యవర్గం తీవ్రంగా ఖండించింది. కాకినాడలోని ఏపీ ఎన్జీవో భవన్‌లో జిల్లా కార్యవర్గం అత్యవసర సమావేశం శనివారం సాయంత్రం నిర్వహించారు. ఇందులో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. సూర్యనారాయణ అడ్డదారుల్లో రూసా రూల్స్‌కు విరుద్ధంగా సంఘానికి గుర్తింపు తెచ్చుకుని, ఉద్యోగుల సమస్యలపై పోరాడకుండా.. 70 ఏళ్ల చరిత్ర ఉన్న ఏపీ ఎన్జీవో సంఘాన్ని విమర్శించడం ఎంతవరకూ సమంజసమని నేతలు ప్రశ్నించారు. ఎన్జీవో సంఘం పూర్వ నేతలు సాధించిన కారుణ్య నియామకం జీవోలో ఉద్యోగం పొంది, ఆ ఫలాల్ని అనుభవిస్తూ అదే సంఘాన్ని విమర్శించడం ఆయన విజ్ఞతకే వదిలి పెడుతున్నామని పేర్కొన్నారు. ఏపీ ఎన్జీవో సంఘం అహర్నిశలూ ఉద్యోగుల ప్రయోజనాల పరిరక్షణకు, హక్కుల సాధనకు పోరాడుతుందని చెప్పారు. ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవులు, జీపీఎఫ్ లోన్లు, కరువు భత్యం చెల్లించాల్సిందిగా ప్రభుత్వాన్ని తమ సంఘం డిమాండ్ చేసిందన్నారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు జి.రామ్మోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, కోశాధికారి వై.పద్మమీనాక్షి, సహాధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు సరెళ్ల చంద్రరావు, కేవీఎస్ ప్రసాద్, సంయుక్త కార్యదర్శులు ఎస్వీకే ప్రసాద్, ఎస్.వీరబాబు, బి.శ్రీనివాసరావు, కాకినాడ పట్టణ అధ్యక్షుడు ఎస్కే అజీజ్, కార్యదర్శి ఎ.సత్తిరాజు తదితర నాయకులు పాల్గొన్నారు.